

టన్ను చీనీ రూ.15 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్ఠంగా రూ.15 వేలు, కనిష్ఠంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.20

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ఠంగా రూ.20, కనిష్ఠంగా రూ.10 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 2,100 టన్నుల టమాట వచ్చింది.

గరిష్ఠం/కనిష్ఠం
34.8°/21.2°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో పశ్చిమ దిశగా గాలి వీచింది.

ఆహ్లాదం పేరిట ఆరగింపు!

నగరవనం నిధులను 'పచ్చ నేత' ఆరగించేందుకు సిద్ధమయ్యారు. తన 'మేత' గురించి ఎవరూ తెలుసుకోకూడదన్న ఉద్దేశంతో ఏకంగా నగరవనాన్ని చిట్టడవిలో ఏర్పాటు చేయించారు. అధికారులు వారించినా అక్కడే అంటూ తేల్చేశారు. కనీసం దారి కూడా లేని ప్రాంతంలో నగరవనం బోర్డు పెట్టి రూ.1.40 కోట్లు ఖర్చు చేశారు. మరో రూ.60 లక్షలు దిగమింగేందుకు సిద్ధమయ్యారు.



అమగొండపాళ్యం అటవీప్రాంతంలోని నగరవనంలో చిల్డ్రన్ పార్కు

- అమగొండపాళ్యం చిట్టడవిలో నగరవనం
- అనువుగాని చోట వద్దని చెప్పిన అధికారులు
- వినిపించుకోని అప్పటి ప్రజాప్రతినిధి
- గత టీడీపీ హయాంలో హడావుడిగా పనులు
- ఇప్పటికే రూ.1.40 కోట్ల వ్యయం
- తాజాగా రూ.60 లక్షల మంజూరు
- చిట్టడవిలోని పార్కుకు ఎలా వెళ్లాలంటున్న జనం

పుట్టపర్తి అర్బన్: నగరవనాన్ని ఎక్కడైనా నగరానికి సమీపంలో ఏర్పాటు చేస్తారు. కానీ పుట్టపర్తిలో మాత్రం ఏకంగా చిట్టడవిలో సిద్ధం చేస్తున్నారు. నగరానికి దూరంగా అమగొండపాళ్యం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నారు. దీంతో అక్కడివరకూ ఎలా వెళ్లాలో తెలియక జనం దిక్కులు చూస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు..

2019 జనవరిలో జిల్లాలోని 4 మున్సిపాలిటీల్లో 5 నగరవనాల ఏర్పాటుకు అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పుట్టపర్తి సమీపంలోని అమగొండపాళ్యం అటవీ ప్రాంతం, కదిరి సమీపంలోని బట్రేపల్లి జలపాతం వద్ద, హిందూపురం సమీపంలోని చలివెందుల, పెనుకొండ కోటపైన ఒకటి, సోమందేపల్లి హైవే పక్కన మరో నగరవనం ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 50 హెక్టార్లలో ఏర్పాటు చేయాల్సిన నగర వనం అందరికీ అనుకూలంగా ఉండేందుకు మున్సిపాలిటీకి 10 కిలోమీటర్ల దూరంలోనే ఏర్పాటు చేయాలన్న నిబంధనలున్నాయి. కానీ పుట్టపర్తిలో మాత్రం ఇందుకు విరుద్ధంగా ఏకంగా చిట్టడవిలో అమగొండపాళ్యం గ్రామ సమీపంలోని సంగ్రోనికుంట వద్ద ఏర్పాటు చేస్తున్నారు.



నగర వనం స్వాగత ద్వారం

అధికారులు వద్దని చెప్పినా..

నగర వనం ఏర్పాటు చేస్తున్న ప్రాంతం అనువుగా లేదని అప్పట్లోనే అధికారులు వారించినట్లు తెలుస్తోంది. సంగ్రోనికుంట వద్ద నగరవనం ఏర్పాటు చేస్తే రక్షణ ఉండదని, ప్రధాన రోడ్డుకు చాలా దూరమని, పర్యాటకులు కూడా అంతదూరం రాలేరని చెప్పినట్లు సమాచారం. బుక్కపట్నం మండలంలోని చెండ్రాయునిపల్లి వద్ద నగరవనం ఏర్పాటు చేస్తే అందరికీ అనువుగా ఉంటుందని సూచించినట్లు తెలుస్తోంది. సమీపంలోనే చెన్నకేశవస్వామి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున వస్తుంటారని... అక్కడ ఏర్పాటు చేస్తే అందరికీ ఉపయోగంగా ఉంటుందని అధికారులు సూచించినా అప్పటి ప్రజాప్రతినిధి వినిపించుకోకుండా భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు.



ఈ రేకుల షెడ్డే.. యోగా సెంటర్

ఇప్పటికే రూ.1.40 కోట్ల వ్యయం..

సంగ్రోనికుంట వద్ద ఏర్పాటు చేస్తున్న నగరవనం కోసం ఇప్పటి వరకూ రూ.1.40 కోట్లు ఖర్చు చేశారు. రెండు రోజుల క్రితం మరో రూ.60 లక్షలు మంజూరు కాగా, వాటితో వివిధ పనులు చేపట్టనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకూ స్వాగత ద్వారం, పిల్లల పార్కు, ఓపెన్ జిమ్, యోగా గది, మరుగుదొడ్లు, క్యాంటీన్ భవనం నిర్మించారు. నీటి కోసం బోరు వేయించారు. మొక్కలు నాటారు. వీటన్నింటికీ కలిపి రూ.50 లక్షలు మించి ఖర్చయి ఉండదని, మిగిలిన మొత్తం సదరు నేత జేబులోకి వేసుకున్నారని జనం ఆరోపిస్తున్నారు. పైగా ఇప్పుడు మరో రూ.60 లక్షలు మంజూరు చేయించుకుని వాటినీ దిగమింగేందుకు సిద్ధమయ్యారని మండిపడుతున్నారు. మరోవైపు అక్కడ పనిచేసే ఇద్దరు పనివాళ్లకు 6 నెలల నుంచి వేతనం ఇవ్వలేదని తెలుస్తోంది.

ప్రారంభానికి సిద్ధం చేస్తాం

నగర వనాన్ని ప్రారంభానికి సిద్ధం చేస్తాం. ఇప్పటికే రూ.1.40 కోట్ల ఖర్చుతో సౌకర్యాలు కల్పించాం. తాజాగా మరో రూ.60 లక్షలు నిధులు వచ్చాయి. పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించి నగరవనం ప్రారంభిస్తాం. నగరవనం పూర్తయితే ఆదివారాల్లో పర్యాటకుల సందడి ఉంటుందనుకుంటున్నాం. అవకాశం వస్తే బుక్కపట్నం మండలం చండ్రాయునిపల్లె వద్ద మరో నగర వనం ఏర్పాటుకు కృషి చేస్తాం.

– చక్రపాణి, జిల్లా అటవీశాఖ అధికారి

వెళ్లేందుకూ ఇబ్బందే..

నగరవనానికి వెళ్లాలంటే పుట్టపర్తి –నల్లమాడ ప్రధాన రహదారి నుంచి దట్టమైన అడవిలో 4 కిలోమీటర్లు ప్రయాణించాలి. అక్కడికి వెళ్లడానికి ఎటువంటి బస్సు సౌకర్యం లేదు. ఆటోలో వెళ్లాలంటే రోడ్డు అధ్వానంగా ఉంది. ద్విచక్ర వాహనాల్లో వెళ్లాలంటే ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని భయం. ఈ అటవీ ప్రాంతంలో ప్రస్తుతం ఎక్కువగా పేకాట రాయుళ్లు, మందుబాబులు, గంజాయి బ్యాచ్ సంచరిస్తూ ఉంటోందని, అడవి జంతువుల కోసం వేటగాళ్లు చిన్నపాటి జిలెటిన్‌స్టిక్స్ అక్కడక్కడా ఉంచుతున్నారని, అందువల్ల నగర వనం వెళ్లే దారి అతి ప్రమాదకరమని స్థానికులు చెబుతున్నారు. ఇక నగరవనంలో ఇంతవరకూ అంతర్గత రోడ్లు కూడా వేయలేదని, దీంతో అంతదూరం వెళ్లినా ఇబ్బందేనని అంటున్నారు.

పింఛన్ సొమ్ముతో సర్వేయర్ ఉడాయింపు

- ఐదురోజులైనా దొరకని ఆచూకీ
- చర్యలకు సిద్ధమైన ఉన్నతాధికారులు



చెన్నేకొత్తపల్లి: లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన పింఛన్ సొమ్ముతో సచివాలయ సర్వేయర్ ఉడాయించిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఎంపీడీఓ బాలకృష్ణుడు, ఈఓఆర్డీ అశోక్‌నాయక్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని న్యామద్దెల సచివాలయం–1లో హేమంత్‌కుమార్ గ్రామ సర్వేయర్‌గా పని చేస్తున్నాడు. అక్టోబర్ నెలకు సంబంధించిన పింఛన్ల పంపిణీ కోసం అధికారులు గత నెల 30 తేదీన ఆయనకు కొంత నగదు అందజేశారు. 1వ తేదీ పింఛన్లు పంపిణీ చేసిన హేమంత్‌కుమార్.. ఆరుగురు వృద్ధులకు అందించాల్సిన రూ.24 వేలు, ఓ దివ్యాంగుడికి పంపిణీ చేయాల్సిన రూ.15 వేలు... మొత్తంగా రూ.39 వేలతో అదే రోజు ఉడాయించాడు. ఆరోజు నుంచి హేమంత్‌కుమార్ ఫోన్ కూడా పని చేయలేదు. దీంతో న్యామద్దెల పంచాయతీ కార్యదర్శి సుధాకర్ రెడ్డి ఈ విషయాన్ని ఎంపీడీఓ దృష్టికి తీసుకురాగా, ఆయన ఉన్నతాధికారులకు తెలిపారు. అయితే తాను స్వాహా చేసిన మొత్తాన్ని బుధవారం సాయంత్రంలోపు తిరిగి చెల్లిస్తానని హేమంత్‌కుమార్ ఇతరుల ద్వారా సమాచారం పంపినా...ఆ మేరకు డబ్బు తిరిగి చెల్లించలేదు. దీంతో ఆయనకు నోటీసు జారీ చేసినా... సంజాయి ఇవ్వలేదని అధికారులు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని వారు వెల్లడించారు.

న్యూస్‌రీల్

వర్షసూచన



అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి అనంతపురం జిల్లాకు రాగల నాలుగు రోజులు వర్ష సూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత వాతావరణశాఖ, విశాఖ కేంద్రం నుంచి అందిన సమాచారం మేరకు ఈ నెల 9న 10 మి.మీ, 10న 14 మి.మీ, 11న 14మి.మీ, 12న 15 మి.మీ మేర సగటు వర్షపాతం నమోదు కావొచ్చన్నారు. ఉష్ణోగ్రతలు పగలు 34.2 డిగ్రీల నుంచి 34.8 డిగ్రీలు, రాత్రిళ్లు 23 డిగ్రీల నుంచి 23.5 డిగ్రీల మధ్య నమోదవుతాయన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 68 నుంచి 75, మధ్యాహ్నం 47 నుంచి 70 శాతం మధ్య రికార్డు కావొచ్చన్నారు. గంటకు 5 కిలోమీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీస్తుందని తెలిపారు.

పోక్సో కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు

- రూ. 5 వేలు జరిమానా
- బాధితురాలికి రూ.4.5 లక్షల పరిహారం
- తీర్పు వెలువరించిన అనంతపురం పోక్సో స్పెషల్ కోర్టు



నల్లమాడ: అత్యాచారం కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ. 5 వేల జరిమానా విధిస్తూ అనంతపురం పోక్సో కేసుల స్పెషల్ కోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. అలాగే బాధితురాలికి రూ.4.50 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. నల్లమాడ సీఐ నరేంద్రరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. 2020 సంవత్సరంలో మండలంలోని యర్రవంకపల్లికి చెందిన బండి ఆదినారాయణ అనే వ్యక్తి గ్రామంలోని బాలిక ఇంట్లో ఒంటరిగా ఉండటం గమనించి ఇంట్లోకి చొరబడ్డాడు. బాలికపై అత్యాచారం చేశాడు. అనంతరం బాధితురాలు ఫిర్యాదు చేయగా... నల్లమాడ పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి కదిరి డీఎస్పీ ఈ ఘటనపై విచారణ జరిపి అనంతపురం జిల్లా పోక్సో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసు బుధవారం న్యాయ స్థానంలో విచారణకు రాగా, సాక్ష్యులను విచారించిన న్యాయమూర్తి.. ముద్దాయి ఆదినారాయణపై అభియోగాలు రుజువు కావడంతో శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు కౌన్సెలింగ్



కార్యదర్శులతో ఆప్షన్లు తీసుకుంటున్న దృశ్యం

అనంతపురం రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రేడ్ –5 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్-4కు పదోన్నతి కల్పిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను జిల్లా పంచాయతీ కార్యాలయంలో బుధవారం చేపట్టి పంచాయతీ కార్యదర్శుల నుంచి ఆప్షన్లను తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో 154 మంది గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు ఉండగా, వీరందరికీ గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా పంచాయతీ అధికారి సమత తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు రెండేళ్ల జైలు

పెనుకొండ రూరల్: అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 లక్షల జరిమానా విధిస్తూ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జడ్జి ఎం.బొజ్జప్ప తీర్పు చెప్పారు. 'కియా' ఎస్‌ఐ ఎం.రాజేష్ తెలిపిన వివరాల మేరకు... పెద్దవడుగూరు మండలం వీరన్నపల్లికి చెందిన నూతనపాటి నరేష్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. 2020 మే 23 తేదీన కారులో కర్ణాటక నుంచి మద్యాన్ని జిల్లాకు తీసుకువస్తూ మార్గమధ్యంలో 'కియా' వద్ద పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో అప్పటి ఎస్‌ఐ గణేష్ కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో బుధవారం ముద్దాయికి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైఎస్సార్ సీపీ నేతలపై పోలీసుల పక్షపాతం

- పరుషకు వెళ్లకుండా అడ్డుకున్న వైనం
- ఆత్మాభిమానం, ఆత్మగౌరవంపై దాడి చేశారన్న గోరంట్ల మాధవ్



తాడిమర్రిలో పరుషకు వెళ్లకుండా మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, ఇతర నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

ధర్మవరం: తాడిమర్రి మండల కేంద్రంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల పట్ల పోలీసులు పక్షపాతం చూపారు. వైఎస్సార్ సీపీకి చెందిన మాజీ మంత్రి మాలగుండ్ల శంకర నారాయణ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి తదితరుల పట్ల ఖాకీలు నిరంకుశంగా ప్రవర్తించారు. తాడిమర్రిలో కురుబ సామాజిక వర్గం ఆధ్వర్యంలో జరుగుతున్న ఆర్వేడుపట్నం పెద్దయ్యస్వామి పరుషకు వెళ్లకుండా పోలీసులు వైఎస్సార్ సీపీ నేతలను అడ్డుకోవడం వివాదాస్పదమైంది. ఉదయం 10.30 గంటల సమయంలో పరుషకు వెళ్లేందుకు శంకర నారాయణ, గోరంట్ల మాధవ్ తాడిమర్రికి వచ్చారు. ఈ సందర్భంగా వారికి తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, ఆయన కుమారుడు మనోజ్‌రెడ్డి కార్యకర్తలతో కలసి ఘన స్వాగతం పలికారు. అనంతరం పరుషకు వెళుతుండగా డీఎస్పీ హేమంత్ కుమార్, సీఐ రెడ్డెప్ప సిబ్బందితో కలసి వైఎస్సార్ సీపీ నేతలను అడ్డుకున్నారు. ఎందుకు వెళ్లకూడదని వారు ప్రశ్నించగా.. ప్రస్తుతం పరుషలో మంత్రి సత్యకుమార్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఉన్నారని, ఇప్పుడు మీరు వెళితే లా అండ్ ఆర్డర్ సమస్య వస్తుందని అన్నారు. తాము ఎవరితోనూ గొడవకు వెళ్లడం లేదని, పరుషలో స్వాములను మొక్కుకుని వస్తామంటూ ఎంత చెప్పినా పోలీసులు వినలేదు. దీంతో పోలీసులు, నేతల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. ఇక్కడి నుంచి చంద్రశేఖర్‌రెడ్డి ఇంటికి వెళ్లాలని పోలీసులు సూచించగా.. తాము పరుషకు వెళతామని, లేదంటే ఇక్కడే ఉంటామని గోరంట్ల మాధవ్ స్పష్టం చేశారు. దీంతో పోలీసులు గోరంట్ల మాధవ్‌ను బలవంతంగా ఎత్తుకుని ప్రధాన రహదారి దాటించారు. అలాగే బారికేడ్లతో వారిని నిలువరించడంతో పాటు ఒక ఐచర్ వాహనాన్ని దారికి అడ్డంగా పెట్టారు. చివరకు మంత్రి సత్యకుమార్, పరిటాల శ్రీరామ్ వెళ్లిపోయిన తర్వాత వైఎస్సార్ సీపీ నేతలను పరుషలోకి అనుమతించారు.

మా కులదైవాన్ని చూడటానికి వెళ్లడం కూడా తప్పా?

మా కురుబల ఆరాధ్యదైవాన్ని చూడటానికి వెళ్లడం కూడా తప్పేనా అని మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ పోలీసులను ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ నేతల పట్ల పోలీసులు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పోలీసుల చర్యలు బడుగు, బలహీన వర్గాల వారి ఆత్మాభిమానం, ఆత్మగౌరవంపై దెబ్బ కొట్టేలా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించాలి

- అధికారులకు కలెక్టర్ శ్యాం ప్రసాద్

ప్రశాంతి నిలయం: 'సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్'పై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్ నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్, గర్ల్ చైల్డ్‌డే, చెత్త సేకరణ, తల్లికి వందనం, పీఎం సూర్యఘర్, వ్యవసాయం, రెవెన్యూ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జీఎస్టీ తగ్గింపు దానివల్ల కలిగే ప్రయోజనాలను వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. అలాగే ఈ నెల 11న నిర్వహించనున్న 'గర్ల్ చైల్డ్' డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇందుకోసం 10వ తేదీన వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. వసతి గృహాల అధికారులు పారిశుధ్యం, భోజన ఏర్పాట్లు, నీటి వసతి, మరుగుదొడ్లు, వంటగది తదితర అంశాలపై నివేదిక ఇవ్వాలన్నారు. ఇక నుంచి ప్రతి వారం 'శానిటేషన్ వీక్' కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. 'తల్లికి వందనం'కు సంబంధించి 1,719 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వాటిని సరిదిద్ది పంపాలన్నారు. 'పీఎం సూర్యఘర్' పథకం గురించి ప్రజలకు వివరించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి రాము నాయక్, ఐసీడీఎస్ పీడీ ప్రమీల, సీపీఓ విజయ్ కుమార్‌లతో పాటు వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ శ్యాం ప్రసాద్

'పీఎం ధన్ ధాన్య కృషి' అమలు చేయాలి..

'పీఎం ధన్ ధాన్య కృషి యోజన' పథకాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో పథకం అమలుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 'పీఎం ధన్ ధాన్య యోజన' పథకం గురించి అర్హులకు వివరించి వారు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రస్తుతం సాగులో ఉన్న పంటలు, ఉత్పాదకత వివరాలను నివేదిక రూపంలో అందించాలన్నారు. తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించే విధంగా రైతులను చైతన్యవంతులను చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి రాము నాయక్, సీపీఓ విజయ్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ, నీటిపారుదల, మత్స్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

కరిగిపోయినా.. కళ్లప్పగించి చూస్తూ!

కందుకూరు గిడ్డంగుల్లో అడుగంటిన బియ్యం స్టాక్

- 15 వేల టన్నులకు ఉన్నది 966 టన్నులే
- కనీసం నెల కోటా కూడా నిల్వ చేయని వైనం
- స్టాక్ రాకపోతే లబ్ధిదారులపై తీవ్ర ప్రభావం

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వ పాలనలో పేదలకు పంపిణీ చేయాల్సిన బియ్యం కూడా ఉమ్మడి జిల్లాకు సకాలంలో సరఫరా కావడం లేదు. ఇటు సర్కారుకు... అటు అధికారులకు ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో ఇలాంటి దుస్థితి ఏర్పడుతోంది. ఈ క్రమంలో ఏ మాత్రం తేడాలొచ్చినా ప్రజా పంపిణీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుంది. అంతిమంగా లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. మరో వారం రోజుల్లో ఎంఎల్‌ఎస్ పాయింట్లకు బియ్యం రవాణా కావాల్సి ఉన్న తరుణంలో... అనంతపురం రూరల్ మండలంలోని కందుకూరు వద్ద ఉన్న గిడ్డంగుల్లో బియ్యం నిల్వలు 996 టన్నులు మాత్రమే ఉండడం ఆందోళన కలిగిస్తోంది.



కందుకూరు గోదాములో నిల్వ ఉన్న కొద్దిపాటి బియ్యం బస్తాలు

ఎంఎల్‌ఎస్ పాయింట్లకు రవాణా

ఉమ్మడి జిల్లాలోని 24 ఎంఎల్‌ఎస్ పాయింట్లకు కందుకూరు వద్ద ఉన్న గిడ్డంగుల నుంచి 19,500 టన్నుల బియ్యం రవాణా అవుతుంది. శ్రీ సత్యసాయి జిల్లాకు నెలసరి 10 వేల టన్నులు, అనంతపురం జిల్లాలోని 12 ఎంఎల్‌ఎస్ పాయింట్లలో 6 పాయింట్లకు ఇక్కడి నుంచి 5 వేల టన్నులు, మరో 6 పాయింట్లకు గుంతకల్లులోని గోడౌన్ నుంచి 4,500 టన్నులు రవాణా చేస్తారు.

అడుగంటిన నిల్వలు..

వాస్తవంగా ప్రతి నెలా 15లోపు ఎంఎల్‌ఎస్ పాయింట్లకు బియ్యం రవాణా చేస్తే అక్కడి నుంచి 30వ తేదీలోపు చౌక దుకాణాలకు చేరవేస్తారు. ఒకటో తేదీ నుంచి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ ప్రారంభమవుతుంది. ఎలాంటి ఇబ్బందికర పరిస్థితి వచ్చినా ప్రజా పంపిణీ వ్యవస్థకు ఆటంకం రాకూడదనే ఉద్దేశంతో గోదాముల్లో కనీసం ఒక నెలకు సరిపడా బియ్యం నిల్వలు అందుబాటులో ఉంచుతారు. అయితే ప్రస్తుతం కందుకూరు వద్ద ఉన్న గిడ్డంగుల్లో 996 టన్నులు మాత్రమే ఉండడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలోని ఎంఎల్‌ఎస్ పాయింట్లకు 15 వేల టన్నుల బియ్యం రవాణా ప్రక్రియను ఇప్పటికే మొదలు పెట్టాల్సి ఉన్నా బియ్యం స్టాక్ లేని కారణంగా ప్రారంభం కాలేదు.

వచ్చినా జాప్యం తప్పదు...

బియ్యం స్టాక్ మూడు రోజుల్లో గిడ్డంగులకు చేరుతుందని అధికారులు చెబుతున్నారు. అయితే, స్టాక్ వచ్చినా సరుకులను సకాలంలో రవాణా చేయడంలో ఇబ్బందులు తప్పేలా లేవు. అధికారులు చెబుతున్నట్లు 11వ తేదీకి సరుకు వస్తే 15వ తేదీలోపు ఎంఎల్‌ఎస్ పాయింట్లకు రవాణా చేయడం అంత సులభం కాదు. అక్కడి నుంచి 30వ తేదీలోపు చౌక దుకాణాలకు చేరవేయడంలోనూ జాప్యం తప్పదు. ఈ సమస్య నుంచి గట్టేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టకపోతే లబ్ధిదారులు ఇబ్బంది పడాల్సి వస్తుంది.

ఇబ్బంది లేకుండా చూస్తాం



కొన్ని కారణాల వల్ల బియ్యం స్టాక్ రావడం ఆలస్యమైంది. మూడు రోజుల్లో 9 వేల టన్నుల బియ్యం చేరుతుంది. వచ్చిన వెంటనే ఎంఎల్ఎస్ పాయింట్లకు రవాణా చేయడం ప్రారంభిస్తాం. లబ్ధిదారులకు ఇబ్బంది రాకుండా బియ్యం పంపిణీకి చర్యలు తీసుకుంటాం.

– రమేష్‌రెడ్డి, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ

అశ్వవాహనం అధిష్టించి.. అభయమిచ్చి



తాడిపత్రి రూరల్: భూదేవి, శ్రీదేవి సమేత చింతలవెంకటరమణస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజు మూలవిరాట్‌కు అర్చకులు మురళి స్వామి అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి అశ్వవాహనంపై ఆశీనులను గావించారు. అనంతరం స్వామి వారు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను దీవించారు.

నేడు చక్రస్నానం

చింతలవెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ముగియనున్నాయి. చివరి రోజు భూదేవి, శ్రీదేవి సమేత చింతల వెంకటరమణస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజల అనంతరం చక్రస్నానం నిర్వహిస్తారు. సాయంత్రం ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలకు అర్చకులు ముగింపు పలుకుతారు.

క్లుప్తంగా

వృద్ధురాలి దుర్మరణం


మహబూబ్‌బీ (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: సిమెంట్ బస్తాలు దించేందుకు వచ్చిన లారీ.. ఓ వృద్ధురాలి పాలిట మృత్యువుగా మారింది. డ్రైవర్ అజాగ్రత్త కారణంగా కుటుంబం దిక్కులేనిదైంది. స్థానికులు తెలిపిన మేరకు.. పుట్టపర్తి మండలం వెంగళమ్మ చెరువుకు చెందిన మహబూబ్‌బీ (62) భర్త నబీసాబ్ నాలుగేళ్ల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి కుమారుడు, కోడలితో కలసి జీవనం సాగిస్తోంది. భర్త చనిపోయిన ఏడాది తర్వాత సొంతింటి నిర్మాణ సమయంలో పైనున్న తీరు బండలు మీద పడి కుమారుడి బాబావలికి వెన్నుముక దెబ్బతినింది. అప్పటి నుంచి ఇద్దరి పింఛన్లతో పాటు కూలి పనులతో కుటుంబానికి మహబూబ్‌బీ చేదోడుగా నిలిచింది. బుధవారం ఉదయం పనికి వెళుతున్న సమయంలో పుట్టపర్తి నుంచి సిమెంట్ బస్తాలతో వచ్చిన లారీ మహబూబ్‌బీని ఢీకొని ఆమె మీదుగా ముందు చక్రాలు దూసుకెళ్లాయి. తల ఛిద్రం కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమీపంలోని బస్టాండులో ఉన్న జనం అక్కడకు చేరుకుంటుండగా వాహనాన్ని ఆపి లారీ డ్రైవర్ ఉడాయించాడు. మహబూబ్‌బీ మృతితో కుటుంబం దిక్కులేనిదయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కూలి పనులకు వెళ్తూ ఎంతో చలాకీ ఉండే ఆమె విగతజీవిగా పడి ఉండడం చూసి కన్నీటి పర్యంతమయ్యారు. నిర్లక్ష్యంగా లారీని నడిపిన డ్రైవర్‌ను కఠినంగా శిక్షించాలని, వృద్ధురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కుమారుడు బాబావలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశిస, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు.

ప్రయాణికురాలి మెడలో గొలుసు అపహరణ


వివరాలు వెల్లడిస్తున్న బాధితురాలు జమున

ధర్మవరం అర్బన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసును ఓ దుండగుడు చాకచక్యంగా అపహరించాడు. బాధితురాలు తెలిపిన మేరకు.. చెన్నేకొత్తపల్లి మండలం గంగినేపల్లితండాకు చెందిన రవినాయక్ భార్య జమున బుధవారం ఉదయం తన కుమార్తెను అనంతపురంలోని కళాశాలలో వదిలి తిరుగు ప్రయాణంలో ధర్మవరానికి వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కింది. తలనొప్పిగా ఉండడంతో టాబ్లెట్ వేసుకుని బస్సులోనే నిద్రపోయింది. బస్సు ధర్మవరం బస్టాండ్‌కు చేరుకున్న సమయంలో నిద్ర లేచిన ఆమె తన మెడలో ఉన్న మూడున్నర తులాల బరువునన బంగారు గొలుసు కనిపించకపోవడంతో ఆందోళనకు లోనైంది. బంగారు గొలుసును చోరీ చేశారని నిర్ధారించుకుని విషయాన్ని ఆర్టీసీ డీపో అధికారులకు తెలపడంతో ... వారు వెంటనే ధర్మవరం వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు బస్టాండ్‌కు చేరుకుని జమునతో జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. బస్సులో తన పక్కన గుర్తు తెలియని వ్యక్తి కూర్చున్నాడని కళాజ్యోతి సర్కిల్‌లో అతను దిగిపోయాడని పోలీసులకు వివరించింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

• కొనేవారు లేక..

బత్తలపల్లి: వర్షాభావం కారణంగా నారు మొక్కలను కొనుగోలు చేయకపోవడంతో వాటిని నర్సరీ యజమానులు దిబ్బల్లో పడేస్తున్నారు. బత్తలపల్లిలో దాదాపు 50 నర్సరీలు ఉన్నాయి. ప్రతి నర్సరీ యజమాని రైతులకు అందుబాటులో ఉండేలా వంగ, టమాట, మిరప, పూల నారు సిద్ధం చేశారు. మొత్తం 50 నర్సరీలలో దాదాపు మూడు కోట్లకు పైగా మొక్కలు సిద్ధంగా ఉంచారు. ట్రేలలో విత్తనం వేస్తే 25 రోజులకు మొక్క సిద్ధమవుతుంది. నెల రోజులలోపు వాటిని రైతులు తీసుకెళ్లి పంట పొలాల్లో నాటాల్సి ఉంటుంది. అయితే వర్షాభావంతో పాటు బోరు బావులలో నీరు అడుగంటి పోవడంతో మొక్కలను కొనుగోలు చేసేందుకు రైతులు ముందుకు రావడంలేదు. దీంతో నర్సరీలలో అభివృద్ధి చేసిన మొక్కలు ఎటూ కాకుండా పోయాయి. దీంతో రూ.1.50 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు నర్సరీ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


నర్సరీ యజమానులు దిబ్బల్లో పడేసిన నారు

తెగులు.. దిగులు

- మారిన వాతావరణంతో పంటలకు ఆశించిన తెగుళ్లు
- సతమతమవుతున్న రైతులు
- దిగుబడిపై తీవ్ర ఆందోళన
- పెట్టుబడులూ దక్కేలా లేవని ఆవేదన

అనంతపురం అగ్రికల్చర్: సరైన వర్షం లేక నెల రోజులవుతోంది. సెప్టెంబర్ 15 నుంచి తేలికపాటి వర్షాలతోనే వరుణుడు సరిపెడుతున్నాడు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ కింద సాగు చేసిన పంటలు చాలా ప్రాంతాల్లో ఎండుముఖం పట్టాయి. అధిక ఉష్ణోగ్రతలు, ఆకాశం మేఘావృతం కావడం ఇలా మారిన వాతావరణ పరిస్థితుల్లో దాదాపు అన్ని పంటల్లో చీడపీడల వ్యాప్తి పెరిగింది. దీంతో దిగుబడులు, పెట్టుబడి ఖర్చులపై రైతులు ఆందోళన చెందుతున్న పరిస్థితులు నెలకొన్నాయి.

పదును వర్షమే లేదు..

సెప్టెంబర్ 11 నుంచి ఉమ్మడి జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దాదాపు నెల రోజులు కావస్తున్నా సరైన పదును వర్షం కురవలేదు. అక్కడక్కడ తేలికపాటి మినహా పెద్దగా వర్షాలు పడకపోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పంటలు ఎండుముఖం పట్టాయి. వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, మొక్కజొన్న లాంటి వర్షాధార పంటలు తేమ లేక వాడిపోతున్నాయి. దాదాపు అన్ని పంటలు కీలకదశలో ఉన్నందున వర్షాలు లేకపోవడం వల్ల దిగుబడులు తగ్గే పరిస్థితి ఉందని అంచనా వేస్తున్నారు. సెప్టెంబర్ సాధారణ వర్షపాతం 111.6 మి.మీ కాగా 87 మి.మీ వర్షం కురిసింది. అంటే


కనగానపల్లి మండలం వేపకుంటలో ఎండుముఖం పట్టిన ఆముదం

సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. ప్రస్తుత అక్టోబర్‌లో ఇంకా వరుణుడు బోణీ చేయలేదు. ఎక్కడా తేలికపాటి కూడా నమోదు కాలేదు. అక్టోబర్‌లో 100.9 మి.మీ సాధారణ వర్షపాతంగా గుర్తించినా ప్రస్తుతానికి కేవలం 2.3 మి.మీ నమోదు కావడం గమనార్హం. దీంతో అటు ఖరీఫ్ పంటలతో పాటు ఇటు రబీ పంటల సాగుకు కూడా ఇబ్బందికరంగా మారింది. ఖరీఫ్‌కు సంబంధించి జిల్లాలో 3.43 లక్షల హెక్టార్లకు గానూ 88 శాతంతో 3.01 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు వేశారు. అత్యధికంగా కంది 1.04 లక్షల హెక్టార్లు, వేరుశనగ 91 వేల హెక్టార్లు, పత్తి 26 వేల హెక్టార్లు, మొక్కజొన్న 29 వేల హెక్టార్లు, ఆముదం 16 వేల హెక్టార్లలో వేశారు. అటు శ్రీ సత్యసాయి జిల్లాలోనూ

దెబ్బతీస్తున్న తెగుళ్లు, పురుగులు..

మరోవైపు ఖరీఫ్ పంటలను పురుగులు, తెగుళ్లు వ్యాపించి పంటలను దెబ్బతీస్తున్నాయి. వేరుశనగలో కాండంకుళ్లు తెగులు, టిక్కా ఆకుమచ్చ తెగులు ఆశించినట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పత్తిలో రసంపీల్చుపురుగు, తెల్లదోమ, గులాబీరంగు కాయతొలచు పురుగు ఆశించాయి. వరిలో ఆకుముడుత, ఆముదంలో నామాలపురుగు ఆశించి దెబ్బతీస్తున్నాయి. కందిలో మారుకామచ్చపురుగు, పచ్చపురుగు, పెసర, మినుములో మారుకాగూడు కట్టే పురుగు, మొక్కజొన్నలో కత్తెర పురుగు, మిరపలో తామరపురుగు, పచ్చపురుగు తదితర చీడపీడలు, తెగుళ్లు పంటలను దెబ్బతీస్తుండటంతో పిచికారీ ఖర్చులు పెరిగిపోయాయి. సస్యరక్షణ చేయకుంటే పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపించే పరిస్థితి నెలకొంది.

పరిస్థితి దారుణంగానే ఉంది. ఈ ఖరీఫ్‌లో 2.20 లక్షల హెక్టార్లకు గానూ 1.20 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగు చేశారు. అందులో 49 వేల హెక్టార్లలో వేరుశనగ, 27 వేల హెక్టార్లలో కంది, మొక్కజొన్న 23 వేల హెక్టార్లు, ఆముదం 5 వేల హెక్టార్లు, పత్తి 4 వేల హెక్టార్లలో సాగు చేశారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా వెంకట్రామిరెడ్డి



కదిరి: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తనకల్లు మండలానికి చెందిన యువ న్యాయవాది జి.వెంకట్రామిరెడ్డిని పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రిమాండ్‌కు అంగన్‌వాడీ సిబ్బంది

తనకల్లు: మండలంలోని ముత్యాలవారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న కార్యకర్త పుప్పాల రాధమ్మ, ఆయా కత్తి కుళ్లాయమ్మను కదిరి రూరల్ సీఐ నాగేంద్ర ఆదేశాల మేరకు బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. జూన్ 3న అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న సంపులో పడి గ్రామానికి చెందిన పుప్పాల సంధ్యారాణి, పుప్పాల గిరీష్‌బాబు దంపతుల కుమారుడు నిశాంత్ బాబు మృతి చెందిన విషయం తెలిసిందే. బాలుడి తల్లి సంధ్యారాణి ఫిర్యాదు మేరకు అప్పట్లో అనుమానస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అంగన్‌వాడీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే బాలుడు మృతిచెందినట్లుగా నిర్ధారణ కావడంతో నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కల్తీ మద్యంతో సంపద సృష్టినా?

- మడకశిర వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



మడకశిర: సంపద సృష్టి అంటే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరచడమని, అయితే ఇందుకు భిన్నంగా కల్తీ మద్యంతో రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చడం కాదని కూటమి ప్రభుత్వంపై మడకశిర వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారుతున్నా సీఎం చంద్రబాబు పట్టించుకోవడం లేదని విమర్శించారు. అన్నమయ్య జిల్లా ములకలచెరువు టీడీపీ ఇన్‌చార్జ్ కల్తీ మద్యం తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. టీడీపీ పెద్దల కనుసన్నల్లోనే కల్తీ మద్యం విక్రయాలు జరుగుతున్నాయనేందుకు ఇంతకన్నా నిదర్శనం మరొకటి ఉండదన్నారు. మద్యం షాపుల్లో అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టి కల్తీ మద్యం లేకుండా చేయాలని డిమాండ్ చేశారు. మడకశిర నియోజకవర్గంలో బెల్ట్ షాపులను అరికట్టాలన్నారు.

సస్యరక్షణతో మెరుగైన దిగుబడులు

- ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ రామసుబ్బయ్య


సూచనలు ఇస్తున్న రామసుబ్బయ్య

పుట్టపర్తి అర్బన్: తగిన సస్యరక్షణ చర్యలు చేపడితే మేలైన పంట దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ రామసుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి వ్యవసాయ కార్యాలయంలో పంట దిగుబడులపై రైతులకు అవగాహన కల్పించారు. ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉందన్నారు. ఇలాంటి తరుణంలో మచ్చ తెగులు వ్యాపించే ప్రమాదముందన్నారు. నివారణకు లీటరు నీటికి ఎక్సాకొనజోల్ 2 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. కంది పంట ప్రస్తుతం 60 రోజులు కావస్తోందని లీటరు నీటికి కలిపి ప్రొఫెనోపాస్ 2 ఎంఎల్ లేదా ఓమైట్ 1 ఎంఎల్ పిచికారీ చేయాలన్నారు. మొక్కజొన్న పంట కంకి దశ నుంచి విత్తనం అభివృద్ధి దశకు చేరుకుందన్నారు. 60 రోజుల దశలో యూరియా 50 కిలోలు, 25 కిలోల పొటాష్ ఎరువులు వాడాలన్నారు. వరి పిలకల దశలో ఉందని ఎకరాకు యూరియా 50 కిలోలు వాడాలన్నారు. నల్లి తెగులు నివారణకు లీటరు నీటికి ప్రొఫెనోపాస్ 2 ఎంఎల్, ఓమైట్ ఒక ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ఆనంద్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో క్షుద్రమాంత్రికుడు

పుట్టపర్తి అర్బన్: తమపై, తమ గ్రామస్తులపై చేతబడి చేస్తున్నారంటూ ఓ మాంత్రికుడిని బంధించి పోలీసులకు అప్పగించిన ఘటన కలకలం రేపింది. పుట్టపర్తి మండలం బడేనాయక్ తండాకు చెందిన ఆర్మీ జవాన్ వినోద్‌నాయక్ తెలిపిన మేరకు... జవాన్ కుటుంబం, ఇతరులపై కక్షగట్టిన అదే గ్రామానికి చెందిన బాలకృష్ణ, లక్ష్మీరాం, చంద్రకళ, జయాబాయి.. అనంతపురం జిల్లా గుత్తికి చెందిన మాంత్రికుడు విరూపాక్షను సంప్రదించి క్షుద్రపూజలు చేయించారు. బుధవారం జవాన్ కుటుంబ సభ్యుల ఫొటోలు, వంశవృక్షం ఉంచి నిమ్మకాయలు మంత్రిస్తూ క్షుద్రపూజలు చేస్తుండగా వినోద్ నాయక్ గుర్తించి అడ్డుకున్నాడు. అనంతరం మాంత్రికుడిని పోలీసులకు అప్పగించాడు. ఈ విషయంపై ఎస్ఐ లింగన్నను వివరణ కోరగా విరూపాక్షపై గతంలో పలు కేసులు ఉన్నాయని తెలిసిందన్నారు. దీంతో విరూపాక్షతో పాటు మరో నలుగురిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నామన్నారు.

రేషన్‌షాపుగా రైతు సేవా కేంద్రం

రామగిరి: కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు సేవ కేంద్రాలు నిర్వీర్యమయ్యాయి. ఇదే అదనుగా ఎవరు పడితే వారు అనధికారికంగా ఆర్‌ఎస్‌కే భవనాలను వాడుకుంటున్నారు. పేరూరులోనూ ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. గ్రామంలో ఓ చౌకధాన్యపు డిపో డీలర్ ఈ నెల ఒకటో తేదీ నుంచి రేషన్ పంపిణీని ఏకంగా రైతు భరోసా కేంద్రంలో ప్రారంభించారు. అధికార పార్టీ నాయకుల నోటిమాటగా భవనాన్ని తన ఆధీనంలోకి తీసుకున్నట్లుగా తెలుస్తోంది. బియ్యం, ఇతర సరుకులు నిల్వ చేసి.. దర్జాగా ప్రభుత్వ భవనాన్ని వాడుకోవడం చూసి ప్రజలు కంగుతిన్నారు. ఈ విషయమై తహసీల్దార్ రవికుమార్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. ఇప్పటి వరకూ తన దృష్టికి రాలేదన్నారు. ప్రభుత్వ భవనంలో రేషన్ పంపిణీ చేయరాదన్నారు. ఎవరు అనుమతిచ్చారో తెలుసుకుని.. తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.


రేషన్ పంపిణీ జరుగుతున్న పేరూరులోని రైతు సేవా కేంద్రం

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

హిందూపురం: రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలంటూ కూటమి ప్రభుత్వాన్ని రాజకీయ పార్టీల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. డిమాండ్ సాధనలో భాగంగా బుధవారం హిందూపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో ప్రజాభిప్రాయ సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం వరకు సుమారు 3వేల మంది సంతకాలు చేశారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందుకుండా పోతాయని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు శ్యాంసుందర్, శ్రీనివాసులు, మున్నా, రవికుమార్, నాగరాజ్, నౌషాద్, హరికుమార్, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.


సంతకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ

జ్వర తీవ్రతను తాళలేక యువకుడి బలవన్మరణం


మృతుడు మల్లికార్జునరెడ్డి

ఓడీచెరువు(అమడగూరు): జ్వర తీవ్రతను తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన మేరకు.. అమడగూరు మండలం శీతిరెడ్డిపల్లికి చెందిన శంకరెడ్డి, ఆదిలక్ష్మమ్మ దంపతుల కుమారుడు మల్లికార్జునరెడ్డి (23) కొంత కాలంగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నా ఫలితం లేకపోయింది. బుధవారం జ్వర తీవ్రతను తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఓట్ల చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ


మాట్లాడుతున్న రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి

మడకశిరరూరల్: ఓట్ల చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మడకశిర మండలం నీలకంఠాపురంలో బుధవారం రాత్రి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి, ఏఐసీసీ కార్యదర్శి గణేష్‌యాదవ్, మాజీ మంత్రి రఘువీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల వ్యవస్థ స్వయం పాలన, స్వీయ నిర్ణయాధికారం కాపాడడానికి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టామన్నారు. దొంగ ఓట్లతో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. కార్యక్రమంలో మధుగిరి ఎమ్మెల్యే కేఎన్ రాజన్న, మాజీ ఎమ్మెల్యే సుధాకర్, హిందూపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ కేటీ శ్రీధర్, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు కోటా సత్యం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

రొళ్ల: మండలంలోని కె.బ్యాడిగెర గ్రామానికి చెందిన లింగప్ప (59) ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య కెంపమ్మతో పాటు కుమారులు స్థానికంగా లేకపోవడంతో ఆయన ఒంటరిగా నివాసముంటున్నాడు. మూడేళ్ల క్రితం ప్రమాదంలో కాలికి అయిన గాయం నయం కాకపోవడంతో నాలుగు రోజుల క్రితం స్నానపు గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం దుర్వాసన వెదజల్లడంతో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థిని ఆత్మహత్య


అశ్విని(ఫైల్)

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ప్యాదిండికి చెందిన గంగాధర్ కుమార్తె అశ్విని (16) ఆత్మమత్య చేసుకుంది. రామగిరిలోని కేజీబీవీలో ఇంటర్ సీఈసీ మొదటి సంవత్సరం చదువుతున్న అశ్విని ఇటీవల దసరా సెలవుల నేపథ్యంలో ఇంటికి వచ్చింది. బుధవారం కళాశాలకు వెళ్లాల్సి ఉండగా మంగళవారం రాత్రే తల్లిదండ్రులు ఆమెకు అవసరమైన దుస్తులు, పుస్తకాలను సర్ది పెట్టి ఇచ్చారు. బుధవారం తెల్లవారుజామున అశ్వినిని తల్లి పార్వతమ్మ నిద్రలేపి త్వరగా రెడీ కావాలని చెప్పి ఇంటి పనిలో నిమగ్నమైంది. అయితే కాలేజీకి వెళ్లడం ఇష్టం లేని అశ్విని... నేరుగా ఇంటి పక్కనే ఉన్న పశువుల పాకలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో అశ్విని కనిపించకపోవడంతో తల్లిదండ్రులు గాలింపు చేపట్టారు. పశువుల పాకలో ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కుమార్తెను చూసి ఆగమేఘాలపై ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


కడుపు నొప్పి తాళలేక...

పరిగి: మండలంలోని కాలువపల్లికి చెందిన కురుబ గంగాధరప్ప భార్య శివగంగమ్మ(50) ఆత్మహత్య చేసుకుంది. కొన్నేళ్ల క్రితమే గంగాధరప్ప మృతి చెందాడు. కుమారుడు లోకేష్ వృత్తి రీత్యా హైదరాబాదులో ఉంటున్నాడు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్న శివగంగమ్మ పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంది. అయినా నయం కాకపోవడంతో మంగళవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అదే రోజు రాత్రి ఫోన్ చేస్తున్నా తల్లి స్పందించకపోవడంతో సమీప బంధువుకు కుమారుడు లోకేష్ ఫోన్ చేసి విషయం తెలిపాడు. దీంతో బంధవు ఇంటి వద్దకెళ్లి పరిశీలించడంతో ఆత్మహత్య విషయం వెలుగు చూసింది. అనారోగ్యం కారణంతోనే తన తల్లి ఆత్మహత్య చేసుకుందంటూ లోకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వేధింపులపై కేసు నమోదు

కదిరి టౌన్: అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ వివాహిత చేసిన ఫిర్యాదు మేరకు అత్తింటి వారిపై కేసు నమోదు చేసినట్లు కదిరి సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు. వివరాలను బుధవారం ఆయన వెల్లడించారు. కదిరిలోని దేవళం బజారుకు చెందిన మహర్షికి 7 నెలల క్రితం కొత్తచెరువు మండలం ఎర్రపల్లి గ్రామానికి చెందిన శ్రుతితో వివాహమైంది. ఇద్దరూ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఇటీవల అదనపు కట్నం కోసం భర్త, అత్త, మామ, ఆడబిడ్డ వేధించసాగారు. శారీరకంగా మానసికంగా ఇబ్బందులు పెడుతున్నారు. వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో బాధితురాలు చేసిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి


రమణ (ఫైల్)


ముదిగుబ్బ: మండలంలోని రామస్వామి తండా సమీపంలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడిని బుక్కపట్నం మండలం గసికవారిపల్లికి చెందిన రమణ (46)గా పోలీసులు గుర్తించారు. బుధవారం ద్విచక్ర వాహనంపై ముదిగుబ్బ నుంచి స్వగ్రామానికి వెళుతుండగా కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆనకు భార్య సరోజమ్మ, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

తాడిమర్రి: మండల కేంద్రం సమీపంలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పెద్దకోట్ల గ్రామానికి చెందిన మంజుల ప్రమీల కుమారుడు నాగరాజు బుధవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై తాడిమర్రికి బయలుదేరాడు. మండల కేంద్రం సమీపంలోకి చేరుకోగానే పార్నపల్లికి చెందిన రంగనాయకులు కారులో వెళుతూ మలుపులో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ఘటనలో నాగరాజుకు కాలు విరిగింది. సమాచారం అందుకున్న బాధితుని కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మొదలైన పంట కోత ప్రయోగాలు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ పంట కోత ప్రయోగాలు మొదలయ్యాయి. సాగు చేసిన పంటల్లో దిగుబడులు అంచనా వేయడానికి ప్రణాళిక, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగాలు చేపట్టారు. కొన్ని పంటలకు దిగుబడుల ఆధారంగా ఫసల్‌బీమా పరిహారం అందిస్తున్న నేపథ్యంలో ఈ ప్రయోగాలకు ప్రాధాన్యత నెలకొంది. మొత్తంగా 1,122 సీసీఈలు నిర్వహిస్తుండగా ఇందులో గ్రామం యూనిట్‌గా కందికి ఫసల్‌బీమా వర్తింపజేస్తూ అత్యధికంగా 846 ప్రయోగాలు చేపట్టనున్నారు. అలాగే వరిలో 96, జొన్నలో 36, మొక్కజొన్నలో 72, ఆముదంలో 36, ఎండుమిరపలో 36 పంట కోత ప్రయోగాలు చేపట్టనున్నారు. ఇవి కాకుండా వాతావరణ బీమా వర్తింపజేసిన వేరుశనగ, పత్తితో పాటు సజ్జ, కొర్ర పంటల్లోనూ కొన్ని ప్రయోగాలు చేపట్టి దిగుబడులను అంచనా వేయనున్నారు. అటు శ్రీసత్యసాయి జిల్లాలోనూ అత్యధికంగా కందిలో 720 పంట కోత ప్రయోగాలు, మొక్కజొన్నలో 84, వరిలో 36, రాగిలో 26, ఆముదంలో 26 పంట కోత ప్రయోగాలు చేపట్టనున్నారు. ఈ క్రమంలో బుధవారం అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లి గ్రామంలో రైతు అంకె బాలపెద్దన్న సాగు చేసిన వేరుశనగ పంటలో దిగుబడులు అంచనా వేసేందుకు ప్రయోగం నిర్వహించారు. 5 ఇంటు 5 అడుగుల చుట్టు కొలతల ప్లాట్ నుంచి 2.700 కిలోల దిగుబడి వచ్చినట్లు ఏఓ వెంకటకుమార్, ఏఈఓ మురళీకృష్ణ తెలిపారు.


ఇటుకలపల్లి వద్ద వేరుశనగలో చేపట్టిన పంట కోత ప్రయోగం

మోరీని ఢీకొన్న కారు.. వ్యక్తి మృతి

పావగడ: స్థానిక పీఎస్ పరిధిలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా... మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. మడకశిర మండలం రేకులకుంట గ్రామానికి చెందిన నరసింహమూర్తికి పావగడ తాలూకా కడపలచెరువు గ్రామానికి చెందిన మణితో వివాహమైంది. ఈ క్రమంలో పుట్టింటికి వచ్చిన భార్యను చూసేందుకు బుధవారం తన స్నేహితుడు గోపాల్ (56)తో కలసి కారులో కడపల చెరువుకు వచ్చాడు. సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. తుమకూరు రోడ్డులోని కణివేనహళ్లి గేట్ వద్దకు చేరుకోగానే కారు నడుపుతున్న నరసింహమూర్తి నియంత్రణ కోల్పోవడంతో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న మోరీని ఢీకొంది. ఘటనలో గోపాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన నరసింహమూర్తిని స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, గోపాల్‌కు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.